సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం । 13 । జనవరి । 2024



ఊరెళ్తున్నారా.. జాగ్రత్త
పండగకు ఊరెళ్లేవారు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.
వివరాలు 10లో ▸



పాలమూరులో క్రీడా సందడి
ఫాస్ట్–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌నకు పాలమూరు వేదికైంది.
వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
33.1/22.2

వాతావరణం
చలి ప్రభావం అధికంగా ఉంటుంది. విపరీతమైన మంచు కురుస్తుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

గద్వాల క్రైం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంత గ్రామాలకు, దూర ప్రాంతాలకు వెళ్తున్న వారు అప్రమత్తంగా ఉండటంతో పాటు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రితిరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని సూచించారు. పండగ దృష్ట్యా చోరీలు జరగకుండా పోలీస్‌శాఖ నియంత్రణ చర్యలు చేపట్టామని, ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విలువైన వస్తువులు ఇంట్లో పెట్టరాదని, వ్యక్తిగత ఆర్థిక విషయాలు ఇతరులకు ఏమాత్రం చెప్పరాదని పేర్కొన్నారు. హోం సెక్యూరిటీ సిస్టమ్ ద్వారా ఇంటర్‌నెట్‌కు అనుసంధానం ఉన్న మీ ఫోన్ నుంచి మీ ఇంటిని చూసుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా ప్రజలు పోలీసుశాఖ చెప్పిన సూచనలు పాటించాల్సిందిగా ఎస్పీ పేర్కొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌గా అదనపు కలెక్టర్

గద్వాల రూరల్: గ్రంథాలయ చైర్మన్ నామినేటెడ్ అభ్యర్థులను కొత్త ప్రభుత్వం రద్దు చేయడంతో చైర్మన్‌గా అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహన్ బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వం నుంచి ఉత్వర్వులు వెలువడ్డాయి.

మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నికకు నోటిఫికేషన్

గద్వాల వ్యవసాయం: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి మహేష్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా ఈనెల 16వతేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. అలాగే, 20వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు.

ఏబీఎఫ్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల రూరల్: నీతిఅయోగ్ అస్పిరేషనల్ కార్యక్రమంలో భాగంగా అస్పిరేషనల్ బ్లాక్ ఫెల్లోలో ఏడాది పాటు ఒప్పంద విధానంలో పనిచేసేందుకు అర్హత కలిగిన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు httpr//gadawal.telangana.govt.in/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, అదేవిధంగా దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 18వ చివరి తేదీ అని తెలిపారు.

ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలి

గద్వాల అర్బన్: మహనీయుల ఆశయసాధనలో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి బహుజన రాజ్యాధికారం సాధించాలని బీఎస్పీ సౌత్‌జోన్ కన్వీనర్ గణపురం కృష్ణ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ కేశవరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జ్ అతిఖుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో గద్వాల, వనపర్తి, అలంపూర్ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కాన్షీరాం లాంటి మహనీయుల ఆశయ సాధనలో భాగంగా ముందుకెళ్తామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ సెగ్మెంట్‌లో బీఎస్పీ గెలుపే లక్ష్యంగా కార్యచరణ రూపొందించామని, అందుకు గాను కార్యకర్తలు కష్టపడి చేయాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల నియోజకవర్గాల బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8వేలు



గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 1,661 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.8000, కనిష్టం రూ.4099, సరాసరి రూ. 7399 ధరలు పలికాయి. 41 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ. 5369, కనిష్టం రూ. 3881, సరాసరి రూ. 5260 ధరలు వచ్చాయి. 19 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం 3040, కనిష్టం 1186, సరాసరి ధర రూ. 2140 ధరలు వచ్చాయి. 4 క్వింటాళ్ల గరిష్టం, కనిష్టం, సరాసరి రూ. 2140 ధర పలికింది. 67 క్వింటాళ్ళ కంది రాగా గరిష్టం రూ.8850, కనిష్టం రూ. 4019, సరాసరి రూ. 8769 ధరలు పలికాయి.

వసతులు కరువు

జిల్లా కేంద్రంలో రూ.4 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం



సగం కాంక్రీట్.. సగం మట్టితో కూడిన గద్వాల బస్టాండ్ ప్రాంగణం

- కానరాని మరుగుదొడ్లు
- అసంపూర్తిగా పనులు.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- జిల్లాలోని పలు బస్టాండ్‌లదీ ఇదే దుస్థితి
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

గద్వాల క్రైం/అయిజ: తాజా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ.. మహాలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించింది. దీంతో ఒక్కసారిగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. బస్టాండ్‌లు అన్నీ కూడా మహిళలతో నిండిపోతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆయా ప్రాంతాలకు ప్రయాణించేందుకు బస్టాండ్‌లకు వచ్చే మహిళలు, విద్యార్థినులు, ప్రయాణికులు మాత్రం అక్కడ మౌలిక వసతుల్లేక అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల జిల్లా కేంద్రంలో రూ.4కోట్లతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ఇందుకు ఓ ఉదాహరణ. రూ.కోట్లు వెచ్చించి బస్టాండ్ నిర్మించినా.. బాత్‌రూంలు, మరుగుదొడ్లు మాత్రం కానరాలేదు. నీటి వసతి కల్పించలేదు. పనులు సైతం అసంపూర్తిగా వదిలేయడంతో దుమ్మూ ధూళితో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు అయిజ, శాంతినగర్, అలంపూర్, ధరూర్ బస్టాండ్‌లలోనూ పూర్తి స్థాయిలో సౌకర్యాలు



నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికల కోడ్‌తో హడావుడిగా ప్రారంభం

జిల్లా కేంద్రమైన గద్వాలలో గతంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను మౌలిక వసతులు లేవనే కారణంతో కూల్చివేశారు. గత ప్రభుత్వం ఇక్కడ ఆధునిక వసతులతో బస్టాండ్ నిర్మించేందుకు రూ.4కోట్లు మంజూరు చేసింది. అధికారులు కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకొని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం భవనాన్ని నిర్మించారు. 14 ప్లాంట్‌ఫాంలు, కుర్చీలు, రెండు క్యాంటీన్లు, 13 వ్యాపార దుకాణాలు, గదులు నిర్మించారు. అయితే బాత్‌రూంలు, మరుగుదొడ్లు నిర్మించలేదు. ఈక్రమంలో గత ఏడాది అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికల కోడ్ పడుతుందనే ఉద్దేశంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు పనులు పూర్తి కాకుండానే హడావుడిగా ప్రారంభించారు.

అసంపూర్తి పనులతో ఇబ్బంది



గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌ను ఇటీవల ప్రారంభించారు. అయితే సీసీ బెడ్డు నిర్మాణం పనులు అసంపూర్తంగానే ఉన్నాయి. దానివలన వర్షాకాలంలో మైదానంలో నీరు నిలిచే అవకాశం ఉంది. దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు వ్యాప్తి చెందుతాయి. త్వరితగతిన అనంపూర్తి పనులు పూర్తిచేయాలి.

– త్రివిక్రమ్‌రెడ్డి, గద్వాల

బాత్‌రూంలు ఏర్పాటు చేయాలి



నూతన ఆర్టీసీ బస్టాండ్‌లో పాత బాత్‌రూంలు, మరగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అదనంగా ఎలాంటి బాత్‌రూంలు, మరుగుదొడ్లు నిర్మించలేదు. పెరిగిన రద్దీకి ఇవి ఏమాత్రం సరిపోవు. దీంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టసీ ప్రయాణ ప్రాంగణంలో రెండు వైపులా బాత్‌రూంలు, మరుగుదొడ్లు నిర్మిస్తే బాగుంటుంది. తాగునీటి వసతి కల్పించాలి. నిరక్షరాస్యుల కోసం ఏ సమయంలో ఏ బస్సు వచ్చి వెళ్తుందో మైక్ ద్వారా తెలిపే ఏర్పాటు చేయాలి. – లక్ష్మి, ఉత్తనూరు

మౌలిక వసతులు కల్పిస్తాం



త్వరలో బస్టాండ్ ప్రాంగణంలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం. వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. కాంక్రిట్ శ్లాబ్ నిర్మాణ పనుల కోసం ఇటీవల రూ.30లక్షల బడ్జెట్ మంజూరైంది. టెండర్ ప్రక్రియ ద్వారా వారంలో పనులు ప్రారంభిస్తాం. షాపింగ్ కాంప్లెక్స్‌లకు సైతం టెండర్లు పిలిచాం. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతాం.

– మంజులారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్

ప్రయాణ ప్రాంగణంలో మౌళిక వసతులు లేకపోడం, నిర్మాణం అసంపూర్ణంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు జిల్లాగా ఉండడంతో ఆయా రాష్ట్రాలకు చెందిన చెందిన ప్రయాణికులు ఎక్కువగా గద్వాల బస్టాండ్‌కు వస్తుంటారు. దీనికితోడు జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్ కూడా ఉండడంతో ఎప్పుడూ వందల మంది ప్రయాణికులతో ఆర్టీసీ ప్రాంగణం కిక్కిరిసి ఉంటుంది. కానీ ప్రయాణీకులకు సరిపడా బాత్‌రూంలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. గద్వాల బస్టాండ్ ఆవరణలో గతంలో నిర్మించిన మరుగుదొడ్లనే ప్రయాణికులు ఉపయోగించుకుంటున్నారు. ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఇవి ఏమాత్రం సరిపోవడంలేదు. చాలామటుకు ప్రయాణికులు ఆరుబయటే మూత్ర విసర్జన చేస్తున్నారు. అలాగే, బస్సులు ప్లాట్‌ఫాం వద్ద నిలిపేందుకు కాంక్రిట్ శ్లాబ్‌లను 50 శాతం మేర నిర్మించి మిగతా 50

తూతూమంత్రంగా పనులు

శాతం మేర మట్టివేసి వదిలేశారు. బస్సులు మట్టి మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో విపరితమైన దుమ్మూ ధూళితో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మైదానం మొత్తం సీసీ బెడ్డు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే, దాహార్తిని తీర్చేందుకు ఆర్‌ఓ (వాటర్) ప్లాంట్ సైతం లేకపోవడంతో డబ్బులు వెచ్చించి వాటర్ బాటిళ్లు కొనాల్సిన పరిస్థితి నెలకొంది. బయటి వాహనాలు సైతం ఎక్కడ పడితే అక్కడే పార్క్ చేయడం సమస్యగా మారింది. సరైన పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. బస్టాండ్‌లోని వ్యాపార దుకాణాల టెండర్ల ప్రక్రియ పూర్తి చేయలేదు. జిల్లా బస్టాండ్‌తో పాటు అయిజ, శాంతినగర్,



బస్టాండ్ ఆరుబయటే మూత్రవిసర్జన

అలంపూర్, ధరూర్ తదితర బస్టాండ్‌ల వద్ద ప్రయాణికులకు సౌకర్యాలు కన్పించిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి లేదు. ఇప్పటికైన ప్రభుత్వ అధికారులు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతుల విషయంలో దృష్టి సారించి సౌకర్యాలు కల్పించాల్సిందిగా ప్రయాణికులు పెదవిరుస్తున్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆందోళన



మృతదేహాలతో రోడ్డుపై బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులు

అలంపూర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు తక్షణ ఆర్థికసాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు అందోళనకు దిగారు. ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని ఉత్తర ఫుడ్స్ సమీపంలో ఈ నెల 11వ తేదిన జాతీయరహదారి నిర్వహణ పనులు చేస్తున్న కూలీలపైకి పాల ట్యాంకర్ దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో సీతారాముడు, రమేష్ మృతి చెందిన విషయం విధితమే. కర్నూల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నేషనల్ హైవే అథారిటీకి నిర్వహణకు సంబంధించిన పనులు చేసే కూలీలు కావడంతో తక్షణ ఆర్థిక సాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న నేషన్ హైవే అథారిటీ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై మృతదేహాలను ఉంచి ధర్నాకు దిగారు. అయితే సదరు కాంట్రాక్టర్ వారికి తక్షణ సహాయంపై భరోసా ఇవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

పనుల్లో వేగం

- ఊపందుకున్న కల్వకుర్తి– నంద్యాల జాతీయ రహదారి నిర్మాణం
- ఏడాదిలోపు పూర్తిచేసేలా కార్యాచరణ
- వేసవి నుంచి సోమశిల ఐకానిక్ బ్రిడ్జి ప్రారంభం
- భూసేకరణ పూర్తయితే అన్ని అడ్డంకులు తొలగినట్లే
- రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తగ్గనున్న దూరభారం



నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి వద్ద కొనసాగుతున్న 167కె జాతీయ రహదారి నిర్మాణ పనులు

సాక్షి, నాగర్‌కర్నూల్: కల్వకుర్తి– నంద్యాల జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే పనులు ప్రారంభమై ఆరునెలలు గడుస్తుండగా.. మరో ఏడాదిన్నర కాలంలోనే రహదారి నిర్మాణం పూర్తి చేసేలా ముందుకెళ్తున్నారు. మొత్తం రూ.1,800 కోట్ల అంచనాలతో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ నిర్మాణాన్ని చేపట్టగా మొదటి విడతగా రూ.401 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. వచ్చేనెలలో సోమశిల వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ చేపట్టనుండటంతో పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు పట్టాలెక్కనున్నాయి. ఏకకాలంలో రహదారితోపాటు బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసేలా కసరత్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లేందుకు ప్రయాణికులు కర్నూలు మీదుగా వెళ్లాల్సి వస్తుండగా.. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే 80 కి.మీ., మేర దూరభారం తగ్గనుంది.

పదిచోట్ల బైపాస్ రోడ్లు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలను సులభతరం చేసేందుకు చేపట్టిన కల్వకుర్తి– నంద్యాల జాతీయ రహదారికి కేంద్రం 167కే నంబరును కేటాయించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల వరకు మొత్తం 173.73 కి.మీ., దూరం వరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ రోడ్డుపై వెళ్లే వాహనాలు వంద కి.మీ., వేగంతో వెళ్లగలిగే సామర్థ్యాన్ని కల్పించనున్నారు. రహదారి నిర్మాణంలో భాగంగా 10 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మాణంతో మొత్తం మూడు వరుసల్లో రహదారి నిర్మిస్తున్నారు. పట్టణాలు ఉన్నచోట నాలుగు వరుసలతో పాటు ఇరువైపులా పేవ్‌మెంట్‌వే నిర్మాణాలు చేపడతారు. అలాగే ఈ దారిలో మొత్తం 10 చోట్ల బైపాస్, సర్వీస్ రోడ్లను నిర్మించనున్నారు. తెలంగాణలో కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో మండుగుల, శివాపురం, కర్వెన మీదుగా నంద్యాల వరకు రహదారి నిర్మాణం కొనసాగుతుంది. ఇరు రాష్ట్రాల మధ్యనున్న కృష్ణానదిపై సోమశిల వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు.

భూ సేకరణతోనే చిక్కులు..

కల్వకుర్తి– నంద్యాల 167కె జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం సర్వే ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. రోడ్డు నిర్మాణంతో పాటు బైపాస్ రోడ్డు నిర్మాణానికి 362 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. బైపాస్ రోడ్ల వద్ద నాలుగు వరుసల రహదారి కోసం 45 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించనున్నారు. భూసేకరణపై ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రక్రియను ప్రచురించాల్సి ఉంది. కల్వకుర్తి మండలంలో అత్యధికంగా 106.55 ఎకరాలు, నాగర్‌కర్నూల్ మండలంలో 76.95 ఎకరాలు, తాడూరులో 63.15, కొల్లాపూర్ పరిధిలో 49.73 ఎకరాలు, పెద్దకొత్తపల్లిలో 39.76, తెలకపల్లి మండలంలో 0.51 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది.

ప్రత్యేక ఆకర్షణగా ఐకానిక్ బ్రిడ్జి

కృష్ణాతీరంలోని సోమశిల వద్ద తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించేందుకు ఐకానిక్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇందుకోసం వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి కానుంది. అనంతరం వచ్చే వేసవిలోనే ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. బ్రిడ్జి మీదుగా వాహనాలు వెళ్లడంతోపాటు బ్రిడ్జి కింద నుంచి సందర్శకులు నడుచుకుంటూ వెళ్లి కృష్ణానది అందాలను వీక్షించేందుకు వీలుగా గాజుతో ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఇరురాష్ట్రాల నడుమ రవాణాకు అనుకూలంగా ఉండటంతోపాటు పర్యాటకులకు సైతం ఐకానిక్ బ్రిడ్జి ఆకర్షణీయంగా ఉండనుంది.

గడువులోగా పూర్తిచేస్తాం..

కల్వకుర్తి– నంద్యాల జాతీయ రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వచ్చేనెల రోజుల్లో బ్రిడ్జి నిర్మాణానికి సైతం టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది. భూసేకరణ కోసం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల అయ్యాక సేకరణ ప్రారంభమవుతుంది. ఒప్పందం ప్రకారం రెండేళ్ల గడువులోనే రహదారితోపాటు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తవుతాయి.

– అశోక్‌రెడ్డి, డీఈ, ఎన్‌హెచ్‌ఏఐ

త్వరలో అందుబాటులోకి 300 పడకల ఆస్పత్రి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 300 పడకల ఆసుపత్రి పనులు చివరి దశలో ఉన్నట్లు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పటికీ ఎమ్మెల్యేగా గద్వాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందన్నారు. అదేవిధంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహను కోరగా వెంటనే నియమించారని వివరించారు. అదేవిధంగా మెడికల్ కాలేజీ తరగతులను కూడా ఈ విద్యాసంవత్సరం నుంచే మొదలు కాబోతున్నట్లు తెలిపారు. దీనిద్వారా ఈప్రాంతం ప్రజలకు మెరుగైన వైద్యం అందనుందని, పక్కనున్న కర్నూల్, రాయచూరు ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పనున్నట్లు తెలిపారు.

రాజ్‌కుమార్ కుటుంబానికి అండగా వుంటాం



రాజ్‌కుమార్ తల్లిదండ్రులకు రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న, నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి

శాంతినగర్: సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో పనిచేసి గుండె పోటుతో మృతిచెందిన రాజ్‌కుమార్ కుటుంబానికి అండగా వుంటామని, తల్లిదండ్రులకు అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ భరోసా ఇచ్చారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ ఇందిరానగర్‌లో నివాసం వుంటున్న రాజ్‌కుమార్ (21) కొన్నేళ్ల క్రితం సీపీఐ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రెడ్‌గార్డ్‌గా చేరాడు. క్రిస్మస్ పండుగకు శాంతినగర్‌కు వచ్చిన రాజ్‌కుమార్ ఈనెల 4న గుండె పోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి శుక్రవారం శాంతినగర్‌కు చేరుకున్నారు. రాజ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.5 లక్షలకు సంబంధించిన చెక్కును రాజ్‌కుమార్ తల్లిదండ్రులు మద్దిలేటి, జ్యోతమ్మలకు అందజేశారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా వుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు, ప్రజానాట్యమండలి గాయకుడు పల్లె నర్సింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న, గోవిందు, అంజయ్య, భీమన్న, రాంచందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద



స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత, కాంగ్రెస్ నాయకులు

గద్వాల అర్బన్: స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత అని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో రాజీవ్‌మార్గ్ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం.. దేశం కోసం నిరంతరం పని చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఏబీవీపీ ఆధ్వర్యంలోను నివాళులర్పించారు. ఏబీవీపీ పాలమూరు, నల్గొండ సాంబాభ్ ప్రముఖ్ కరేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో ఏబీవీపీ విద్యార్థి సంఘం పని చేస్తోందన్నారు.

గెలుపోటములు సహజం

క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శుక్రవారం గద్వాల మండలం అనంతపురంలో, జిల్లా కేంద్రంలోని రవీంద్ర భారతి పాఠశాల గ్రౌండు క్రికెట్ టోర్నీని ఆమె ప్రారంభించారు. లత్తీపురం వెంకట్రామిరెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి, ఇసాక్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

గద్వాలను విద్యాకేంద్రంగా తీర్చిదిద్దాలి..

గద్వాల: జోగుళాంబ గద్వాల జిల్లాలో ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో విద్యాబోధన చేసి గద్వాలను విద్యాకేంద్రంగా తీర్చిదిద్దాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత సూచించారు. శుక్రవారం బీసీ ఉపాధ్యాయ సంఘం (బీసీటీఏ) రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యాబోధనతో పాటు సేవాభావంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యనందించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌బాబు, బీసీటీఏ జిల్లా అధ్యక్షుడు బీకే వెంకటేష్, ప్రవీణ్, నర్సింహులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలపై పోరాటం

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పుట్టా ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర విధానాలపై ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల ద్వారా విస్తృతంగా ఇంటింటి ప్రచారం, 19వ తేదీన జిల్లాకేంద్రాల్లో కార్మిక, కర్షక ఐక్యత సదస్సులు, జనవరి 26న ట్రాక్టర్లు, వాహన ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆయా కార్యక్రమాలకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఉన్న ఉపాధి అవకాశాలు కోల్పోయారని తెలిపారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కార్పొరేట్ శక్తులను తరిమికొట్టాలని, దేశాన్ని రక్షించాలనే నినాదంతో జరిగే ఈ ఆందోళనలో అన్ని కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, మహిళా, విద్యార్థి లోకమంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎండి జబ్బార్, బాల్‌రెడ్డి, జీఎస్ గోపి, ఎం.రాజు, ఎం.కృష్ణయ్య, వేణుగోపాల్, బాల్యానాయక్, మహబూబ్‌బాషా, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్‌ క్రైం: పురుగుమందు తాగిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ మహేందర్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నల్లవెల్లికి చెందిన ముత్యాల్‌రెడ్డి (35) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో ఈ నెల 10న గ్రామంలోని తన పొలంలో పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి రెఫర్‌ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. తండ్రి సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు



శాంతినగర్‌: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్‌ శివశివాని పాఠశాల సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా.. ప్రయాణికులతో ఆటో అలంపూర్‌ చౌరస్తా నుంచి శాంతినగర్‌కు బయల్దేరింది. శాంతినగర్‌కు అర కిలోమీటర్‌ దూరంలో ఉండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే పంట పొలాలకు పనుల కోసం వెళ్లి వస్తున్న కూలీలు అక్కడికి చేరుకొని ఆటోలో ఉన్న వారిని కాపాడారు. ఇదిలాఉండగా, మద్దూరు స్టేజీ నుంచి పైపాడు స్టేజీ వరకు రోడ్డు గుంతలమయమవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుచున్నారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్‌ క్రైం: ద్విచక్రవాహనం పైనుంచి కిందపడిన వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగనూలుకి చెందిన చంద్రయ్య ద్విచక్రవాహనంపై పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వస్తుండగా.. ప్రమాదవశాత్తు కింద పడిపోవటంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జనరల్‌ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోస్గి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బిజ్జారం వాగు నుంచి శుక్రవారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి పోతిరెడ్డిపల్లి రోడ్డులో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. బిజ్జారం గ్రామానికి చెందిన ట్రాక్టర్లుగా గుర్తించి యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పల్లమర్రిలో..

చిన్నచింతకుంట: మండలంలోని పల్లమర్రి ఊకచెట్టువాగు నుంచి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల కుమార్‌, భోగాల కురుమూర్తి, ముచ్చింతలకు చెందిన రవి శుక్రవారం ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఆర్‌.శేఖర్‌ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి (ఫైల్‌)

ప్రజాసేవే.. శ్వాస.. ధ్యాస

ఆ యువజన సంఘం ఆవిర్భావం మొదలు.. నేటి వరకు ప్రజాసేవే పరమావధిగా అడుగులు వేస్తోంది.. మొక్కల పెంపకంతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన సభ్యులు.. ఏ దిక్కు లేని వారికి అండగా ఉంటూ.. నిరుపేదలు ఆకలితో అలమటించకుండా ప్రతినెలా బియ్యం పంపిణీ చేస్తోంది.. ప్రత్యేకంగా వాటర్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేసి శుద్ధజలం అందిస్తోంది.. మూఢవిశ్వాసాలు, సామాజిక రుగ్మతలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పాఠశాలలకు వెళ్లే బాలికలకు సైకిళ్ల అందించడం.. ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా తమవంతు చేయూతనందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. గత 17 ఏళ్లుగా ప్రజాసేవలో తరిస్తున్న 'ఠాగూర్‌ యువజన సంఘం'పై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- మహబూబ్‌నగర్‌ డెస్క్‌

సిలార్‌పల్లిలో 'అమ్మ' పేరిట సేవా కార్యక్రమాలు

- 145 మంది వృద్ధులకు ప్రతినెలా 9 కిలోల చొప్పున బియ్యం పంపిణీ
- ఒకేసారి ఐదేళ్లలోపు 90 మంది ఆడపిల్లలకు రూ.30 వేల చొప్పున ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌
- 30 మంది పాఠశాల విద్యార్థినులకు సైకిళ్ల అందజేత
- మూఢనమ్మకాలు, ప్లాస్టిక్‌ వాడకం, మద్యపాన నిషేధంపై అవగాహన
- ఆదర్శంగా.. ఠాగూర్‌ యువజన సంఘం అడుగులు

నాగర్‌కర్నూల్‌ జిల్లా కల్వకుర్తి పరిధిలోని సిలార్‌పల్లిలో 2007లో ఆవిర్భవించిన ఠాగూర్‌ యువజన సంఘం 'అమ్మ' పేరిట ఎన్నో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మొదట్లో మొక్కల పెంపకంతో ప్రస్థానం మొదలుపెట్టి.. అంచెలంచెలుగా అభాగ్యులకు అన్నివిధాలుగా అండగా నిలిచే స్థాయికి ఎదిగింది. ఈ క్రమంలో ముగ్గురితో ప్రారంభమైన సంఘం.. ప్రస్తుతం 40 మందితో కొనసాగుతూ నిర్విరామంగా సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటికే గ్రామంలో మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌ వాడకంతో కలిగే నష్టాలను వివరించడం, మద్యపాననిషేధంపై యువతను చైతన్యం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గ్రామంలో విరివిగా మొక్కలు నాటడంతోపాటు ఆసక్తి గలవారికి మొక్కలు పంపిణీ చేశారు. గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వాటర్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేసి నామమాత్రపు ధరకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందేలా చొరవ చూపిస్తున్నారు. ప్రధానంగా మరుగుదొడ్లపై అవగాహన కల్పించి ఇంటింటికీ నిర్మించుకునేందుకు సహకరించారు. దీంతో గ్రామాన్ని ప్రభుత్వం ఓడీఎఫ్‌గా గుర్తించడంలో యువజన సంఘం కీలకపాత్ర పోషించిందని చెప్పవచ్చు.

వృద్ధుల ఆకలి తీరుస్తూ..

గ్రామంలో 145 మంది నిరుపేద వృద్ధులను గుర్తించి ప్రతినెలా ప్రభుత్వం సరఫరా చేసే రేషన్‌ రీతిలో 9 కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏటీఎం మాదిరిగా లబ్ధిదారుల ఫొటోలతో 'అమ్మ' పేరిట కార్డులు ముద్రించి ఇవ్వడం విశేషం. ప్రతి మూడు నెలలకోసారి మరింత మంది లబ్ధిదారులను గుర్తిస్తామని, గ్రామంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదనేది తమ ఉద్దేశం అని సంఘం సభ్యులు చెప్పారు.



గ్రామంలోని వృద్ధురాలికి బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి (ఫైల్‌)

కలిసికట్టుగా ముందుకు..



యువజన సంఘం ప్రారంభించినప్పుడు ఐదుగురితో కలిసి ప్రారంభించిన సంఘంలో ప్రస్తుతం 50 మంది ఉన్నాం. అందరం కలిసికట్టుగా ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఉండటం వల్లే సంఘాన్ని ఇంత సమర్థవంతంగా నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నాం. ప్రతి ఏడాది ఏదో ఒక నూతన కార్యక్రమం చేపట్టాలని ఆశయంగా పెట్టుకున్నాం.

– సతీష్‌కుమార్‌, ఠాగూర్‌ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, సిలార్‌పల్లి

మంచి ఆదరణ



మా యువజన సంఘం తరఫున చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మంచి ఆదరణ వస్తుంది. గ్రామస్తుల సహకారం లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేం. ప్రజల ఆదరణతోపాటు సంఘం సభ్యుల ప్రోత్సాహంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– రాములు, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ, ఠాగూర్‌ యువజన సంఘం

అదృష్టంగా భావిస్తున్నా..



ప్రజలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించే యువజన సంఘం అధ్యక్షుడిగా పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. పేదలకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలే కాకుండా.. మావంతుగా తోచిన సహాయం చేసేందుకు సంఘాన్ని ఏర్పాటు చేశాం.

– రాజు, అధ్యక్షుడు, ఠాగూర్‌ యువజన సంఘం

ఏ ఇబ్బంది లేకుండా..



ఎలాంటి బంధుత్వం లేకున్నా ఇంటికి పెద్ద కొడుకులాగా యువజన సంఘం సభ్యులు సహకరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యం కొన్ని రోజులకే వస్తుండగా.. వీరు కూడా 9 కిలోల బియ్యాన్ని అందించడంతో ఏ ఇబ్బంది లేకుండా మా జీవితం గడిచిపోతోంది.

– మాసమ్మ, సిలార్‌పల్లి

పాప చదువుకు వెచ్చిస్తా..



ఆడపిల్ల పుడితే తల్లిదండ్రులే భారంగా భావిస్తున్నారు. అలాంటి సందర్భంలో యువజన సంఘం సభ్యులు ఆర్థిక స్తోమత లేని ఆడపిల్లకు వారే స్వయంగా డబ్బులు డిపాజిట్‌ చేయడం సంతోషించదగ్గ విషయం. వీరు అందించే డబ్బును నా కూతురు చదువు కోసమే వెచ్చిస్తా.

– సునీత, సిలార్‌పల్లి

నడిచే బాధ తప్పింది..



మా ఊరి నుంచి కల్వకుర్తిలోని పాఠశాలకు నడిచి వెళ్లేవారం. మా ఇబ్బందులు చూసిన యువజన సంఘం సభ్యులు సైకిళ్లను ఉచితంగా ఇవ్వడంతో నడిచివెళ్లే బాధ తప్పింది. దీంతో మేమంతా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒకేసారి పాఠశాలకు కలిసి వెళ్లి, తిరిగి వస్తున్నాం.

– సాయిచందన, 8వ తరగతి విద్యార్థిని, సిలార్‌పల్లి

భవిష్యత్‌లో ఉపయోగపడేలా..

పేదింటి ఆడపిల్లలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామంలోని ప్రతి చిన్నారి పేరిట రూ.30 వేలు ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌ చేస్తున్నారు. ఈ డబ్బు వారికి భవిష్యత్‌లో (ఉన్నత చదువులు, పెళ్లి, స్వయం ఉపాధి కల్పన) ఉపయోగపడాలని ఆశిస్తున్నారు. వచ్చే నెలలో చేపట్టబోయే ఈ కార్యక్రమానికి గాను ఇప్పటి వరకు గ్రామంలో సుమారు 90 మంది చిన్నారుల గుర్తించి.. అన్నిరకాల వివరాలు సేకరించారు. త్వరలోనే వీరి పేరిట డబ్బులు డిపాజిట్‌ చేస్తామని, ఆలోగా ఇంకా ఆడపిల్లల సంఖ్య పెరిగితే వారిని కూడా చేరుస్తామని యూత్‌ సభ్యులు పేర్కొన్నారు.

మొక్కల పెంపకంతో శ్రీకారం

వాతావరణ సమతుల్యంతోనే వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుంటాయనే ఉద్దేశంతో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం గ్రామంలో ఖాళీగా ఉన్న స్థలాలతోపాటు ఆసక్తిగలవారికి ఉచితంగా మొక్కలు అందజేసి విరివిగా నాటించారు.

323 మందితో విహారయాత్ర

గ్రామంలోని వృద్ధులు, ఆర్థిక ఇబ్బందులతో వెళ్లలేని సుమారు 323 మందిని విహారయాత్రకు తీసుకెళ్లారు. ప్రత్యేకంగా 5 బస్సులు ఏర్పాటు చేసి పుణ్యక్షేత్రాలు చూపించారు. ఇందుకోసం రూ.11 లక్షలు ఖర్చు చేసినట్లు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్‌కుమార్‌ తెలిపారు.

బాలికలకు భరోసా

గ్రామంలో ఉన్నత పాఠశాల లేకపోవడంతో బాలికలు సమీపంలోని కల్వకుర్తికి వెళ్లాల్సి వస్తోంది. అయితే ఉదయం, సాయంత్రం వేళలో విద్యార్థినులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన యువజన సంఘం గత మూడేళ్లుగా ఏటా పది మంది చొప్పున 8, 9, 10వ తరగతి బాలికలకు సైకిళ్ల అందజేస్తోంది.

చేపట్టబోయే పనులు

ఎన్నో ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్‌ తీగలను సరిచేసేందుకు యూత్‌ ఆధ్వర్యంలో ముందుకొచ్చారు. ఇందుకోసం రూ.6 లక్షలు వెచ్చించి కొత్త తీగలను తీసుకువచ్చామని, త్వరలోనే వీటి బిగింపు ప్రక్రియ చేపడుతామన్నారు. అలాగే గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం, ప్లాస్టిక్‌ నిషేధంలో భాగంగా పేపర్‌ ప్లేట్ల తయారీ కోసం కుటీర పరిశ్రమ ఏర్పాటుకు పూనుకుంటున్నారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగలు అరెస్ట్‌



మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌ రఘునాథ్‌



స్వాధీనం చేసుకున్న పంచలోహ విగ్రహాలు, బంగారు, వెండి ఆభరణాలు, సామగ్రి

- పంచలోహ విగ్రహాలు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నాగర్‌కర్నూల్‌ ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌ రఘునాథ్‌

నాగర్‌కర్నూల్‌ క్రైం: ఆలయాలతో పాటు ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి పంచలోహ విగ్రహాలతో పాటు బంగారు, వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌ రఘునాథ్‌ శుక్రవారం తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. కల్వకుర్తికి చెందిన ఆంజనేయులు, స్వామి, శంకర్‌, శివప్రసాద్‌ చాలారోజులుగా కల్వకుర్తితో పాటు నల్గొండ, కర్నూలు జిల్లాలోని ఆలయాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. కల్వకుర్తిలో శుక్రవారం ఉదయం 6 గంటలకు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా వారంతా పోలీసులను చూసి పారిపోతుండటంతో వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా ఇటీవల కల్వకుర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేసిన చోరీకి సంబంధించిన పలు విషయాలు వివరించారు. నిందితుల నుంచి 58 కిలోల పంచలోహ విగ్రహాలు, ఆభరణాలు, 1.6 తులాల బంగారు, 21.9 తులాల వెండి, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని.. వాటి విలువ రూ.4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఆంజనేయులుపై 16, సైదులుపై 11, శివప్రసాద్‌పై రెండు కేసులు ఉన్నాయని.. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ చెప్పారు. సమావేశంలో కల్వకుర్తి డీఎస్పీ పార్థసారధి, కల్వకుర్తి సీఐ ఆంజనేయులు, ఎస్‌లు రమేష్‌, రాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యపై విచారణ

- రాంపూర్‌పెంటలో మృతదేహాలకు పోస్టుమార్టం

లింగాల: నాగర్‌కర్నూల్‌ జిల్లా లింగాల మండలంలోని నల్లమల లోతట్టు ప్రాంతంలో ఉన్న రాంపూర్‌ పెంటలో పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శుక్రవారం పోలీసులు విచారణ చేపట్టారు. అచ్చంపేట సీఐ అనుదీప్‌, ఎస్‌ఐ శ్రీనివాసులు చెంచుపెంటకు చేరుకొని ఆత్మహత్యకు దారితీసిన వివరాలను తెలుసుకున్నారు. అంతకుముందు పోలీసులు డాక్టర్‌ను తమ వెంట తీసుకెళ్లి రాంపూర్‌ పెంటలోనే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాల కారణంగా చిన్న బయ్యన్న భార్య నాగమ్మ తన ఇద్దరు బిడ్డలకు విషమిచ్చి, తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందని తెలిపారు. మృతురాలి తల్లి ఉడ్తనూరి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. కాగా మృతురాలి భర్త చిన్న బయ్యన్న పెద్దవాగు బేస్‌ క్యాంప్‌లో వాచర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబ సమస్యలు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. అప్పు చేసైనా భార్యాపిల్లలకు కొత్త దుస్తులు తీసుకొచ్చేందుకు మన్ననూర్‌ వెళ్లగా.. అంతలోనే ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు.

ఐదుగురి మృతి ప్రమాద స్థలం పరిశీలన

బాలానగర్‌: వారం రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా.. ముగ్గురు తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. ఘటన స్థలాన్ని శుక్రవారం ట్రెయినీ ఐపీఎస్‌ చిత్తరంజన్‌ రూరల్‌ సీఐ జమ్ములప్పతో కలిసి పరిశీలించారు. ప్రమాదానికి కారణాలపై, రోడ్డు నిర్మాణం తీరుపై ఆరా తీశారు. ఆయన వెంట ఎస్‌ఐ శ్రీనివాస్‌తో పాటు స్థానిక పోలీసులు ఉన్నారు.

తోపులాటలో వ్యక్తి మృతి

- గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు పూర్తి
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన..
- పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం



పోస్టుమార్టం చేసేందుకు వచ్చిన మక్తల్‌ సీఐ రాంలాల్‌



ఆశప్ప (ఫైల్‌)

మక్తల్‌: ఒంటరి మహిళను వేధిస్తుండగా గమనించిన ఓ వ్యక్తి కాపాడబోగా చోటుచేసుకున్న తోపులాటలో కిందపడి మృతిచెందాడు. దీంతో గ్రామ పెద్దలు కల్పించుకొని నిందితుడికి రూ.9 లక్షల జరిమానా విధించి గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించారు. చివరికి ఈ విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలను మక్తల్‌ సీఐ రాంలాల్‌ విలేకరులకు వెల్లడించారు. మండలంలోని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బతుకుదెరువు కోసం వలస వెళ్లగా.. ఆయన భార్య ఇంటి వద్దే ఒంటరిగా ఉంటుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన చిన్ననర్సింహులు ఈ నెల 9న రాత్రి సదరు మహిళ ఇంటి వద్దకు వెళ్లి వేధింపులకు గురిచేశాడు. దీంతో భయపడిన బాధితురాలు బంధువైన ఆశప్ప ఇంటి వద్దకు వెళ్లింది. దీంతో ఆశప్ప, చిన్ననర్సింహులు ఇద్దరు గొడవపడ్డారు. వీరిద్దరి మధ్య తోపులాట జరగడంతో ఆశప్ప కింద పడిపోయాడు. వెంటనే ఆర్‌ఎంపీని ఇంటి వద్దకు పిలిపించి చికిత్స చేయించారు. ఆశప్పను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో ఆటోలో వెంటనే మక్తల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతిచెందాడు. దీంతో ఆశప్ప మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. గ్రామంలో బుధవారం పంచాయితీ పెట్టగా.. ఆశప్ప కుటుంబానికి చిన్ననర్సింహులు రూ.9 లక్షలు ఇవ్వాలని గ్రామపెద్దలు తీర్పు చెప్పారు. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం ఈ విషయం మక్తల్‌ పోలీసులకు తెలిసింది. ఆశప్ప మృతదేహానికి తహసీల్దార్‌ సమక్షంలో పోస్టుమార్టం చేశారు. చిన్న నర్సింహులుతో సహా పంచాయితీ తీర్పు చెప్పిన 26 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

మిడ్జిల్‌: పట్టపగలు ఇంట్లోకి చొరబడి రూ.85వేల విలువైన వస్తువులు దోచుకెళ్లిన ఘటన మండలంలోని రాణిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. రాణిపేట్‌లో నివసిస్తున్న గిరిజ ఉదయం ఇంటికి తాళం వేసి బాలానగర్‌ మండలం నేరళ్లపల్లిలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో చుట్టుపక్కల వారు గుర్తించి ఆమెకు సమాచారం ఇచ్చారు. గిరిజ ఇంటికొచ్చి చూసే సరికి బీరువాలో ఉన్న అర తులం బంగారు చెవి కమ్మలు, 25 తులాల వెండి కడియాలు, రూ.35వేల నగదు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

వరుస సెలవుల నేపథ్యంలో ఇళ్లలో చోరీలు

- బంగారం, నగదు ఇంట్లో ఉంచుకోవద్దని సూచిస్తున్న పోలీసులు

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

మహబూబ్‌నగర్‌ క్రైం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చారు. చాలా మంది పట్టణాలు విడిచి.. స్వగ్రామాలు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇదే అదనుగా భావించే చోరులు ఇంటికి కన్నం వేస్తారు. పేద, మధ్యతరగతి ప్రజలు దాచుకున్న బంగారం, నగదును ఒక్కరాత్రిలో దోచుకుని తీరని వ్యథను మిగులుస్తున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళంవేసే వారు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

అవకాశం కోసం ఎదురుచూపు..

ఎప్పుడు ఇళ్లకు తాళాలువేసి ఊళ్లకు వెళ్తారా? అని గమనించే దొంగలకు అణువంత అవకాశం దొరికినా ఉన్నదంతా ఊడ్చుకెళ్తారు. పండుగ సెలవులు దొంగలకు అదను కాకూడదంటే అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే తాళం వేసిన ఇళ్లు రాత్రికి రాత్రి ఖాళీ అవుతాయి. గత రెండేళ్ల కాలంలో జిల్లాలో నమోదు అయిన చోరీ కేసులను పరిశీలిస్తే.. రాత్రి సమయంలో చోరీలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. 2022లో పగలు చోరీలు 13 జరిగితే, రాత్రివేళ 88 చోరీలు జరిగాయి. సాధారణ చోరీలు 223 దాక ఉన్నాయి. ఇక 2023లో పగలు చోరీలు 33, రాత్రి వేళ 113, సాధారణ చోరీలు 235 జరిగాయి. కాగా.. చోరీ కేసుల్లో కోల్పోయిన సొమ్ము బాధితులకు లభించకపోవడం వల్ల ఆర్థికంగా చితికిపోతున్నారు. చోరీ అయిన సొమ్ములో 20శాతం కూడా రికవరీ కావడం లేదు.



సెలవుల దడ..

ప్రస్తుతం పోలీసుల్లోనూ సెలవుల దడ పట్టుకుంది. సెలవుల్లో చాలా మంది తమ ఇళ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రతీ ఒక్కరి దృష్టి పండుగ వేడుకల మీద ఉంటుంది. ఇదే సమయంలో తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. ఈ సీజన్‌లో గతంలో అనేక చోరీ కేసులు నమోదయ్యాయి. ఇటీవల తాళంవేసి ఉన్న ఇళ్లపై దొంగలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఉన్నదంతా ఊడ్చుకుపోతున్నారు. రోజురోజుకూ నేరగాళ్ల సంఖ్య పెరుగుతుండటంతో వారిని గుర్తించడం తలనొప్పిగా మారింది.

గస్తీ ముమ్మరం..



సెలవు దినాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు నగదు, బంగారం ఇంట్లో పెట్టరాదు. రోడ్డు వైపునకు ఉండే ప్రధాన డోర్‌, గేట్‌కు లోపలివైపు తాళం వేయాలి. మొదటి గదిలో లైట్‌ ఆన్‌చేసి ఉంచాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను కట్టడి చేయవచ్చు. జిల్లా కేంద్రంలోని మూడు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఉన్న బ్లూకోల్ట్స్‌, పెట్రోలింగ్‌, రక్షక్‌లతో గస్తీని ముమ్మరం చేస్తాం. ప్రజలు అత్యవసర సమయంలో డయల్‌ 100 లేదా పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.

– టి.మహేష్‌, డీఎస్పీ, మహబూబ్‌నగర్‌

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఎక్కువ రోజుల పాటు ఊళ్లకు వెళ్లే వారు పోలీస్‌ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిది.
- ప్రధాన ద్వారాల లోపలివైపు తాళం వేయాలి. అలా చేయడం వల్ల ఇంట్లోని వారు ఊరెళ్లారనే అనుమానం చోరులకు రాకుండా ఉంటుంది.
- ఇంట్లోని గదుల్లో విద్యుత్‌ దీపాలు వేసి ఉంచాలి. తాళం వేసిన ద్వారాలకు పరదాలు వేయాలి.
- విలువైన ఆభరణాలు, నగదు వెంట తీసుకెళ్లాలి. లేకుంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- రాత్రిపూట ఒంటరిగా వెళ్లాల్సి వస్తే మహిళలు తక్కువ ఆభరణాలు ధరించాలి. అవసరమైతే భుజంపై నుంచి కొంగు కప్పుకొని వెళ్లడం మరింత శ్రేయస్కరం.
- ఊరెళ్లే ముందు ద్విచక్ర వాహనాలు ఆరుబయట, ప్రహరీ లోపల, ఇంటి ఎదుట పెట్టి వెళ్లకూడదు. వాహనానికి తాళంవేసి సుపరిచితుల ఇళ్లలో ఉంచడం మంచిది.
- సెలవుల్లో కుటుంబ సభ్యులు ఊరెళ్లినప్పుడు ఆభరణాలకు రంగులు, మెరుగులు అద్దుతాం అంటూ ఇళ్లకు వచ్చే వారిపై జాగ్రత్తగా ఉండాలి.
- మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు గదుల అద్దె కోసం వచ్చిన వారికి లేవని చెప్పడమే మంచిది.
- అనుమానాస్పదంగా ఎవరైనా కాలనీల్లో సంచరిస్తే డయల్‌ 100 లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

యావజ్జీవం తప్పదు!



ఏ లెక్కన చూసినా శిక్ష నుంచి చంద్రబాబు తప్పించుకోలేరు

- చుట్టుముట్టిన స్కిల్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఐఆర్‌ఆర్, లిక్కర్, ఇసుక స్కాంలు
- అన్ని కుంభకోణాల ప్రధాన కుట్రదారు, లబ్ధిదారు ఆయనే
- సెక్షన్ 409 కింద ఒక్కో కేసులో యావజ్జీవ ఖైదుకు అవకాశం
- అవినీతి నిరోధక చట్టం కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు
- అయినా ముందస్తు బెయిల్‌ను వక్రీకరిస్తున్న ఎల్లో మీడియా

ఆరు కేసుల్లోనూ శిక్ష తప్పదు

చంద్రబాబుపై ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఎ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37లతోపాటు అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటిలో అత్యంత కీలకమైనవది సెక్షన్ 409. ఆ సెక్షన్ కింద నేరం నిరూపితమైతే యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. అవినీతి నిరోధక చట్టంలోని 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద నేరం నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఇతర సెక్షన్లు సరేసరి. ఈ ఆరు కేసుల్లో తీర్పులు వేర్వేరుగా వస్తాయి. నేరం నిరూపితమై శిక్షలు పడితే చంద్రబాబు వేర్వేరుగా శిక్షలు అనుభవించాల్సి వస్తుంది. ఇప్పటికే చంద్రబాబుకు 73 ఏళ్లు నిండుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓసారి నేరం నిరూపితమై ఒక్కో కేసులో ఐపీసీ 409 సెక్షన్ కింద యావజ్జీవ కారాగార శిక్ష, అవినీతి నిరోధక చట్టం 13(2) కింద గరిష్టంగా పదేళ్ల కారాగార శిక్ష పడితే తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూముల కేసుల్లో లోకేశ్ కూడా నిందితుడిగా ఉన్నారు. నారాయణతోపాటు టీడీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారు కూడా ఉన్నారు. వారంతా శిక్ష అనుభవించాల్సిందేనని నిపుణులు తేల్చి చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉంటూ అవినీతికి పాల్పడిన కేసుల్లో హర్యానా మాజీ సీఎం ఓమ్ ప్రకాశ్ చౌతాలకు 16 ఏళ్ల తర్వాత జైలు శిక్ష పడిన ఉదంతాన్ని ఉదాహరిస్తున్నారు. తాజాగా తమిళనాడులో మంత్రిగా చేసిన సెంథిల్ బాలాజీ, మద్యం కేసుల్లో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఇప్పటికీ బెయిల్ రాకపోవడాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు.

'చంద్రబాబు శాశ్వతంగా జైలు పక్షిగా మారక తప్పదు. ఒకట్రెండ్రోజులు ఆలస్యం కావచ్చు తప్ప, యావజ్జీవ కారాగార శిక్ష మాత్రం పక్కా'అని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఐపీసీ 409 సెక్షన్ కింద ఒక్కో కేసులో విడివిడిగా యావజ్జీవ కారాగార శిక్ష, పీసీ యాక్ట్ 13(బి) కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో బరితెగించి నిబంధనలను ఉల్లంఘించి, యథేచ్ఛగా అవినీతికి పాల్పడిన చంద్రబాబు బాగోతం కట్టలు కట్టలుగా బయట పడుతోంది. భారీ అవినీతి కుంభకోణాల కుట్రదారు, లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబం, సన్నిహితులు, బినామీలేనని డాక్యుమెంటరీ ఆధారాలు, న్యాయ స్థానాల్లో నమోదు చేసిన కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుపై అభియోగాలతో ఏకీభవిస్తూ ఏసీబీ న్యాయస్థానం జ్యుడిషియల్ రిమాండ్ విధించడాన్ని బట్టి చూస్తుంటే.. ఈ ఒక్క కేసు చాలు చంద్రబాబుకు యావజ్జీవ శిక్ష పడటానికి అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. స్కిల్ స్కామ్ కేసులో బెయిల్ ఇస్తున్నప్పుడు గానీ.. తాజాగా మూడు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ సందర్భంగా గానీ చంద్రబాబు అవినీతి చేయలేదని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్కిల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాలకు కర్త, కర్మ, క్రియ గత ముఖ్యమంత్రి చంద్రబాబే అని సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతో వెల్లడి కావడంతో ఆయనకు ఏ రకంగా చూసినా జీవిత ఖైదు తప్పదని న్యాయ నిపుణులు బల్ల గుద్ది చెబుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలోనే ఆయన సర్వం తానై కుట్ర పన్నారు. అందుకోసం కేబినెట్‌కు తెలియకుండా చీకటి జీవోలు జారీ చేశారు. స్కిల్ ప్రాజెక్ట్, ఫైబర్ నెట్, బినామీల పేరుతో అసైన్డ్ భూములు పొందిన వారికి భూ సమీకరణ ప్యాకేజీ, మద్యం కొనుగోళ్లపై ప్రివిలేజ్ పన్ను.. జీఎస్టీ ఎత్తివేత, ఉచిత ఇసుక విధానం.. ఇలా అన్ని కుంభకోణాలకు మార్గం సుగమం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం వేర్వేరు జీవోలను జారీ చేసింది. ఆ జీవోకు కూడా కేబినెట్ ఆమోదం లేకపోవడం చంద్రబాబు కుట్రను వెల్లడిస్తోంది. ఆ జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను కూడా మాయం చేయడం గమనార్హం. మాయం చేసిన నోట్ ఫైళ్లను సీఐడీ అధికారులు రిట్రీవ్ చేసి వెలుగులోకి తేవడంతో అన్ని కుంభకోణాల కుట్రలకు కీలక ఆధారాలు లభించాయి. చంద్రబాబు ముఠా గల్లంతు చేసిన అమరావతిలో అసైన్డ్ భూముల రికార్డులను సీఐడీ వెలికి తీసింది. స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్‌లలో కొల్లగొట్టిన నిధులు చంద్రబాబు నివాసానికే చేర్చిన అవినీతి నెట్‌వర్క్‌ను బ్యాంకు ఖాతాల వివరాలతోసహా ఛేదించింది. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పులు, క్విడ్ ప్రో కో కింద చంద్రబాబు కరకట్ట నివాసం పొందడం, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు దక్కడం, చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట భూ సమీకరణ ప్యాకేజీ పొందడం మొదలైనవన్నీ రికార్డులతో సహా వెలుగులోకి వచ్చాయి. ఈ విధంగా చంద్రబాబు, లోకేశ్, నారాయణల పాత్రను స్పష్టం చేస్తూ పూర్తి డాక్యుమెంటరీ ఆధారాలు లభించాయి. మరోవైపు ఈ కుంభకోణాలంటికీ సూత్రధారి చంద్రబాబే అని కీలక సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. అది కూడా 164 సీఆర్‌సీపీ కింద న్యాయస్థానంలో వాంగ్మూలాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేయడం చట్ట విరుద్ధమని చెప్పినప్పటికీ చంద్రబాబు పట్టించుకోలేదని అప్పటి సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, గుంటూరు జిల్లా కలెక్టర్ వాంగ్మూలాలు ఇచ్చారు. ఫైబర్‌నెట్, స్కిల్ స్కామ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు మంజూరు చేయొద్దని చెప్పినా చంద్రబాబు పట్టించుకోలేదని కీలక అధికారుల వాంగ్మూలాలు నమోదు చేశారు. షెల్ కంపెనీల ప్రతినిధులు కూడా అప్రూవర్‌గా మారి అదే విషయాన్ని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో కన్సల్టెన్సీ కంపెనీ, స్కిల్ స్కామ్‌కు సంబంధించి సీమెన్స్ కంపెనీ కూడా 164 సీఆర్‌సీపీ కింద వాంగ్మూలాలు నమోదు చేశాయి. అన్ని కుంభకోణాల్లో చంద్రబాబు ప్రధాన కుట్రదారు, ప్రధాన లబ్ధిదారు అనేదానికి అటు డాక్యుమెంటరీ ఆధారాలు, ఇటు కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి.

రిమాండ్‌కు పంపడమే తార్కాణం

చంద్రబాబు పాల్పడ్డ ఇన్ని కుంభకోణాలలో ఒక్క స్కిల్ స్కామ్‌ను పరిశీలిస్తే చాలు.. ఆయన అవినీతి బాగోతం తెలిసిపోతోంది. సీఐడీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి చంద్రబాబును అరెస్ట్ చేసిన అనంతరం విజయవాడ ఏసీబీ న్యాయ స్థానంలో హాజరు పరిచింది. ఆ సందర్భంగా దాదాపు 10 గంటలపాటు ఇరుపక్షాల వాదనలను విన్న తర్వాత ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దాంతోనే చంద్రబాబు 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అనంతరం అనారోగ్య కారణాలతోనే ఆయనకు బెయిల్ మంజూరు చేశారు.

ముందస్తు బెయిల్‌పై ఎల్లో మీడియా వక్రీకరణ

ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాల కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కానీ ఆ సందర్భంగా కూడా ఆయన అవినీతికి ఆధారాలు లేవని న్యాయస్థానం చెప్ప లేదు. కేసు పూర్వాపరాల్లోకి ఇంకా తాము వెళ్లడం లేదని కూడా స్పష్టం చేసింది. కేవలం షరతులతోనే ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. విచారణకు చంద్రబాబు సహకరించాలని.. విచారణకు పిలిస్తే వెళ్లాలని కూడా చెప్పింది. కానీ హైకోర్టు తీర్పుకు వక్రభాష్యం చెబుతూ చంద్రబాబుకు క్లీన్ చిట్ లభించినట్టుగా ఈనాడు, ఇతర ఎల్లో మీడియా హడావుడి చేయడం విస్మయ పరుస్తోంది. సీఐడీ సేకరించిన ఆధారాలతో నేరం రుజువు కావడం ఖాయమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నేరం నిరూపితమైన తర్వాత ఒక్కో కేసులో చంద్రబాబుకు యావజ్జీవ జైలు శిక్ష పడుతుందని కూడా తేల్చి చెబుతున్నారు.

'స్కిల్డ్' క్రిమినల్ చంద్రబాబే..!

స్కిల్ స్కామ్ కుట్రదారు, లబ్ధిదారు ఆయనే

- సీమెన్స్ ముసుగులో ప్రజాధనం లూటీ
- జర్మనీ కంపెనీకి తెలియకుండానే ప్రాజెక్టు
- రూ.370 కోట్ల ప్రాజెక్ట్ ఏకంగా రూ.3,300 కోట్లకు పెంపు
- తన ముఠాను మోహరించి నిధుల స్వాహా
- అధికారుల అభ్యంతరాలు బేఖాతరు చేస్తూ నిధుల విడుదల

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పై కేసుల్లో నిందితులు వీరే

- నారా చంద్రబాబునాయుడు
- నారా లోకేశ్
- పొంగూరు నారాయణ
- కింజరాపు అచ్చెన్నాయుడు
- దేవినేని ఉమామహేశ్వరరావు
- కొల్లు రవీంద్ర
- పీతల సుజాత
- చింతమనేని ప్రభాకర్

చంద్రబాబు, లోకేశ్ దొంగలు



చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టిన రంగారావు

- కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారు
- ఎన్నికల ముందు మేమే రూ.150 కోట్లు ఇచ్చాం
- టీడీపీ 75 శాతం పూర్తి చేసిందనేది పచ్చి అబద్ధం
- ఆ పార్టీ ప్రజల కోసం కాదు... కుటుంబం కోసమే
- లోకేశ్ రాయలసీమలో ఎందుకు పోటీ చెయ్యడు?
- ఈ పార్టీలో ఉండలేను... రాజీనామా చేస్తున్నా
- చంద్రబాబు ఫొటో నేలకేసి కొట్టిన రాయపాటి రంగారావు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు లోకేశ్ దొంగలని, ఆ పార్టీ ఓ దిక్కుమాలిన పార్టీ అని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాయపాటి రంగారావు చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేశ్ ధన దాహానికి తమ కుటుంబం సర్వనాశనం అయిపోయిందని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌కు డబ్బే ముఖ్యమని, మరేమీ అవసరం లేదని అన్నారు. ఇక టీడీపీలో ఉండలేనని స్పష్టం చేశారు. పార్టీకీ, పదవికి రాజీనామ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ వెంటనే తన కార్యాలయంలో ఉన్న చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరిన తాము ఆ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. గత ఎన్నికలకు ముందు తమ నుంచి రూ. 150 కోట్లు తీసుకున్నారని తెలిపారు. లోకేశ్, చంద్రబాబునాయుడు ఎంతెంత తీసుకున్నారో తమ వద్ద లెక్కలున్నాయన్నారు. తండ్రి, కొడుకు ఒకరికి తెలియకుండా మరొకరు డబ్బులు తీసుకున్నారన్నారు. డబ్బులు తీసుకుని కూడా పోలవరం ప్రాజెక్టు విషయంలో తమను సర్వ నాశనం చేశారన్నారు. చంద్రబాబు కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారని చెప్పారు. సోమవారం పోలవారం అని చంద్రబాబు చెప్పడం ఉత్త బోగస్ అని అన్నారు. చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరంపై సమీక్ష చేసింది కేవలం లంచాల కోసమేనని చెప్పారు. ప్రతి వారం డబ్బులు వసూలు చేశారని తెలిపారు. తమని హింసించి మరీ డబ్బులు వసూలు చేశారన్నారు. తమ ఆస్తులన్నీ బ్యాంకులో పెట్టుకున్నారని అన్నారు. డబ్బులు వాడుకుని మూడు సంవత్సరాల తర్వాత మమ్మల్ని ప్రాజెక్టు నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి చేసినట్లుగా చంద్రబాబు చెబుతున్నది పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు.

టీడీపీ ఫక్తు వ్యాపార సంస్థ

తెలుగుదేశం రాజకీయ పార్టీయే కాదని, ఫక్తు వ్యాపార సంస్థ అని ఆరోపించారు. ఆ పార్టీ ఉంది ప్రజల కోసం కాదని, కేవలం వాళ్ల బాగుపడటం కోసమేనని చెప్పారు. లక్ష ఉద్యోగాలు తెచ్చామని, శ్రీసిటీ కట్టించామన్నారని, కియా కంపెనీ తెచ్చామని చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. కియా కంపెనీ తెస్తే అనంతపురంలో ఎందుకు ఓడిపోయారని అన్నారు. లోకేశ్ రాయలసీమలో కాకుండా మంగళగిరి ఎందుకొచ్చాడని ప్రశ్నించారు. లోకేశ్‌కు ధైర్యం ఉంటే రాయలసీమలో పోటీ చేయాలని సవాల్ చేశారు. మంగళగిరిలో లోకేశ్‌ను ఓడిస్తానని చెప్పారు. తమ కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉందని, ఎవరినీ మోసం చేయలేదని తెలిపారు. తాను సత్తెనపల్లి సీటు అడిగినా, కన్నా లక్ష్మీనారాయణను నియమించారన్నారు. కన్నా నియామకంతో 83 ఏళ్ల తమ తండ్రి రాయపాటి సాంబశివరావు ఆవేదన చెందారన్నారు. 2014లో రాయపాటి సాంబశివరావు ఎంపీగా గెలిచాక కూడా టీడీపీలో అనేక అవమానాలు ఎదుర్కొన్నారని తెలిపారు. తామే కాదని, పార్టీని నమ్ముకున్న అనేకమంది అప్పుల్లో ఉన్నారని తెలిపారు. చనిపోయిన వారికి ఇన్సూరెన్స్ ఇస్తానని డబ్బులు వసూలు చేసిన లోకేశ్ ఎంతమందికి ఇచ్చారని నిలదీశారు. చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్ర ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. రెండు, మూడు లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారని, ఆ డబ్బులు ఎక్కడ ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదల కోసం పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం పనిచేస్తున్నారని రంగారావు చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని సీఎం జగన్ ఒక సంవత్సరం బడ్జెట్ మొత్తం ఖర్చు పెట్టారని చెప్పారు. ఆ రెండేళ్లు ఆంధ్రప్రదేశ్ జీడీపీ ఎక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంక్ వెబ్‌సైట్ చెబుతోందని తెలిపారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయన్నారు. జగన్ అంటే తమకు ఇష్టమని, ఆయన సీటు ఇస్తే పోటీ చేస్తానని చెప్పారు.

ఖానాపూర్‌వాసికి అత్యున్నత పదవి

- ఆగ్రా పోలీస్ కమిషనర్‌గా జడ్చర్ల పూర్వవిద్యార్థి



రవీందర్‌గౌడ్

జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థి జె.రవీందర్‌గౌడ్ ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా పోలీస్ కమిషనర్‌గా నియమితులయ్యారు.అక్కడ గోరఖ్‌పూర్ రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆయనను అక్కడి ప్రభుత్వం ఆగ్రా పోలీస్ కమిషనర్‌గా నియమించింది. రాజాపూర్ మండలం ఖానాపూర్‌కు చెందిన రవీందర్‌గౌడ్ సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి. ఖానాపూర్, తిర్మలాపూర్ గ్రామాల్లో ప్రాథమిక విద్య పూర్తిచేసిన రవీందర్‌గౌడ్.. జడ్చర్లలో ఉన్నత విద్య అభ్యసించారు. ఆయన జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తూనే.. సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి, 2005లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఆయనను ఉత్తరప్రదేశ్ కేడర్‌కు అలాట్ చేయగా.. లక్నో, బరేలీ, మీరట్, అలీఘడ్ ప్రాంతాల్లో ఎస్‌ఎస్‌పీ, డీఐజీగా పనిచేశారు. 2019లో సిట్‌తో కలిసి పనిచేసిన సమయంలో సోన్‌భద్ర మారణహోమం కేసు దర్యాప్తునకు నాయకత్వం వహించారు. అంతేగాక యూపీ వివాదాస్పద గ్యాంగ్ స్టర్ వికాస్ దూబేపై ఏర్పాటు చేసిన సిట్‌లో కూడా పనిచేశారు. రెండేళ్లుగా గోరఖ్‌పూర్ రేంజ్ డీఐజీగా విధులు నిర్వర్తిస్తున్న రవీందర్‌గౌడ్‌ను ఆగ్రా పోలీస్ కమిషనర్‌గా అక్కడి ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన స్వగ్రామం ఖానాపూర్‌తో పాటు జడ్చర్లలో అతడి మిత్రులు హర్షం వ్యక్తంచేశారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన జాలర్లు



వెంకటేష్

కొల్లాపూర్ రూరల్: మతిస్థిమితం కోల్పోయిన ఓ యువకుడు సోమశిల సమీపంలోని కృష్ణానదిలో దూకేందుకు యత్నించగా.. జాలర్లు కాపాడారు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా.. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గుంతకోడూరుకి చెందిన వెంకటేష్ కొన్నాళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. శుక్రవారం మండలంలోని సోమశిల గ్రామ సమీపంలోని కృష్ణానది వద్దకు చేరుకున్నాడు. నదిలోకి దూకేందుకు యత్నించగా.. గమనించిన కొందరు జాలర్లు అతడిని కాపాడి కొల్లాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ యాలాద్రి సంఘటన స్థలానికి చేరుకొని యువకుడి వివరాలు ఆరా తీశారు. సాయంత్రం కుటుంబసభ్యులకు అతడిని అప్పజెప్పారు. యువకుడిని కాపాడిన జాలర్లను సీఐ అభినందించారు.

పాలమూరులో క్రీడా సందడి

- నేటినుంచి ఫాస్ట్–5 నేషనల్ నెట్‌బాల్ టోర్నీ
- మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ
- హాజరైన 28 రాష్ట్రాల జట్ల క్రీడాకారులు



మహబూబ్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు రెండో ఫాస్ట్–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ (పురుషుల, మహిళల)కు వేదికైంది. జిల్లా యువజన, క్రీడాశాఖ నూతన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం నుంచి ఈ నెల 16 వరకు ఫాస్ట్–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ టోర్నీ జరగనుంది. టోర్నీ విజయవంతం కోసం నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. మొదటిసారిగా ఇండోర్ స్టేడియంలో నెట్‌బాల్ మ్యాచ్‌లు జరగడం విశేషం. అలాగే దాదాపు నాలుగేళ్ల తర్వాత జిల్లాకేంద్రంలో జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.

850 మంది క్రీడాకారులు..

ఫాస్ట్–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో దేశంలోని 28 రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళా జట్లు పాల్గొంటున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, బీహార్, చండీఘర్, చత్తీస్‌ఘడ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, నాగాలాండ్, ఒడిశా, పుదుచ్చేరి, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి దాదాపు 850 మంది క్రీడాకారులు, 70 మంది అఫీషియల్స్ పాల్గొంటున్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల జట్లు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. ఆయా రాష్ట్రాల జట్లను గ్రూప్‌లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలోని రెండు కోర్టుల్లో పురుషుల, మహిళల మ్యాచ్‌లు జరగనున్నాయి.

వసతి వివరాలు ఇలా..

మహిళలకు ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాల, స్టేడియం సమీపంలో, రేయిన్‌బో, మాడ్రన్ స్కూల్, పురుషులకు చైతన్య స్కూల్, లిటిల్ స్కాలర్స్ పాఠశాల, బీబీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో వసతి ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారులందరికీ బీబీహెచ్‌ఎస్‌లో భోజన వసతి కల్పించనున్నారు.

నేడు ప్రారంభోత్సవం..

శనివారం సాయంత్రం 4 గంటలకు ఫాస్ట్–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ టోర్నీ ప్రారంభం జరగనుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నెల 16న సీనియర్ నేషనల్ నెట్‌బాల్ టోర్నీ ముగియనుంది.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం..



ఫాస్ట్– 5 నేషనల్ నెట్‌బాల్ టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. ఇప్పటికే మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఫాస్ట్– 5 సౌత్‌జోన్ నెట్‌బాల్, ట్రాడిషనల్ సౌత్‌జోన్ నెట్‌బాల్ పోటీలు జరుగుతున్నాయి. మల్టీపర్పస్ ఇండోర్‌లో జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలు నిర్వహించానికి అవకాశం ఇచ్చిన స్పోర్ట్స్ ఆఫ్ తెలంగాణ, జిల్లా క్రీడాశాఖ అధికారులకు కృతజ్ఞతలు.
– విక్రమాదిత్యరెడ్డి, అధ్యక్షులు, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ

ఇబ్బందులు లేకుండా చర్యలు..



జిల్లాకు నేషనల్ నెట్‌బాల్ టోర్నీ కేటాయించినందుకు నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా కేంద్రంలో నూతన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో మొదటిసారిగా జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలు జరుగుతుండడం సంతోషంగా ఉంది.
– ఖాజాఖాన్, ప్రధాన కార్యదర్శి, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ

నెట్‌బాల్ చాంపియన్లుగా తెలంగాణ, కర్ణాటక



సౌత్‌జోన్ నెట్‌బాల్ (ట్రెడిషనల్)లో మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ మహిళా జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలో శుక్రవారం జరిగిన సౌత్‌జోన్ నెట్‌బాల్ (ట్రెడిషనల్) నేషనల్ చాంపియన్లుగా పురుషుల విభాగంలో తెలంగాణ, మహిళా విభాగంలో కర్ణాటక జట్లు నిలిచాయి. రన్నరప్ స్థానాలను కర్ణాటక, కేరళ జట్లు దక్కించుకోగా మూడో స్థానాల్లో కేరళ– పుదుచ్చేరి, తెలంగాణ– పుదుచ్చేరి జట్లు నిలిచాయి. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పురుషుల ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 12– 4 గోల్స్ తేడాతో కర్ణాటకపై, మహిళల ఫైనల్‌లో కర్ణాటక జట్టు 20– 18 గోల్స్ తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించాయి.

ఫాస్ట్–5 సౌత్‌జోన్ విజేతలుగా..

ఫాస్ట్–5 సౌత్‌జోన్ నెట్‌బాల్ టోర్నీలో విజేతగాలుగా కర్ణాటక, కేరళ జట్లు నిలిచాయి. పురుషుల ఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక జట్టు 20– 9 గోల్స్ తేడాతో కేరళ జట్టుపై, మహిళ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కేరళ జట్టు 26– 22 గోల్స్ తేడాతో కర్ణాటకపై గెలుపొందాయి. రన్నరప్‌గా కేరళ, కర్ణాటక జట్లు, ఆయా విభాగాల్లో మూడోస్థానాల్లో తెలంగాణ– పుదచ్చేరి జట్లు నిలిచాయి. అనంతరం ఫాస్ట్–5, ట్రెడిషనల్ సౌత్‌జోన్ నెట్‌బాల్ విన్నర్, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు గిరిష్ సి.గౌడ, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్య రెడ్డి, ఖాజాఖాన్, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సాదత్‌ఖాన్, రాంమోహన్ పాల్గొన్నారు.



సౌత్‌జోన్ నెట్‌బాల్ (ట్రెడిషనల్) చాంపియన్‌గా నిలిచిన తెలంగాణ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న గిరీష్ సి.గౌడ

హక్కుల సాధనకు ఏకమవుదాం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వాల్మీకుల హక్కుల సాధన కోసం ఏకమవుదామని తెలంగాణ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్మయ్య అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీలకతీతంగా కలిసివచ్చి హక్కులు సాధించుకోవాలని.. సమస్యలు ఏమైనా ఉంటే అంతర్గతంగా చర్చించుకొని పరిష్కరించుకోవాలని హితవు పలికారు. అనంతరం వాల్మీకి యువసేన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయ నాగరాజు, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా సత్యం, ఉపాధ్యక్షులుగా రవికుమార్, సందీప్, రాఘవేంద్ర, కల్యాణ్, ప్రధాన కార్యదర్శిగా అంజన్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా సాయిపవన్, సంయుక్త కార్యదర్శిగా ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా రామస్వామి, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద నర్సింహ, జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు ఎర్ర నర్సింహ, సతీష్‌కుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: పేకాట ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేసి నగదును స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని వనపట్ల శివారులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం మేరకు.. అచ్చంపేట, తెల్కపల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు, నాగర్‌కర్నూల్ మండలాలకు చెందిన పలువురు వనపట్ల శివారులోని ఓ వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. ఎనిమిది మంది పట్టుబడగా పలువురు తప్పించుకున్నారని వివరించారు. వారి నుంచి రూ 2.43 లక్షల నగదు, 6 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కొండారెడ్డిపల్లికి మహర్దశ



అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి సంబంధించిన డీపీఆర్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు: సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి మహర్దశ పట్టింది. గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచేందుకుగాను ఆయా శాఖల అధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. దాదాపు రూ.20కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీరోడ్ల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ రిపోర్టును స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, జెడ్పీటీసీ కేవీఎస్ రెడ్డి, ఉపసర్పంచ్ వేమారెడ్డిలు శుక్రవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు అందజేశారు. ఇదిలా ఉండగా సర్వారెడ్డిపల్లి నుంచి వంగూరు, తుమ్మలపల్లి మీదుగా కొండారెడ్డిపల్లి వరకు ఉన్న రోడ్డును విస్తరించేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కొండారెడ్డిపల్లి – జంగారెడ్డిపల్లి డబుల్‌రోడ్డు పనులను వేగవంతం చేశారు. గ్రామం నుంచి ఏ వైపునకు వెళ్లినా బీటీరోడ్డు ఉండేవిధంగా చూస్తున్నారు. పాల ఉత్పత్తిదారుల సౌకర్యార్థం పశువైద్యశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. తక్షణమే ప్రైవేటు భవనంలో పశువైద్యశాల ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. అదేవిధంగా కొండారెడ్డిపల్లి రైతువేదికలో మొట్టమొదటగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దివంగత వీరజవాన్ యాదయ్య స్మారకార్థం రూ.20లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణం, రూ.20లక్షలతో బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ భూమిపూజ చేశారు. త్వరలోనే కొండారెడ్డిపల్లి రూపురేఖలు మారనున్నాయి.